క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న సీడీపీఓ వెంకటలక్ష్మి

మఠంపల్లి : మండలంలోని పెదవీడులో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ వెంకటలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌష్టికాహారం, గుడ్లు తదితర వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పిల్లలకు, తల్లులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యదర్శి రాజా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి వాసికి జాతీయ పురస్కారం



కర్ల శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

మఠంపల్లి : మఠంపల్లికి చెందిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు కర్ల శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం లభించింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో భాగంగా జరిగిన కవి సమ్మేళనంలో ప్రతిభ కనబర్చిన తనకు జాతీయ పురస్కారం అందించినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక సీఈఓ ప్రతాప్, కన్వీనర్ రమాదేవిల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ఆయనను అభినందించారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు చూపుతున్న దివ్యాంగులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో సోమవారం కోదాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులు 20 మందికి 50 శాతం రాయితీతో బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు అబ్దుల్, సీతయ్య, దివ్యాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

గరిడేపల్లి : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువును ఈ నెల 31 తేదీ వరకు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, ఎంఈఓ చత్రునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన అభ్యర్థులు ఇంటర్మీడియట్‌ను ఒకే ఏడాదిలో పూర్తి చేసేందుకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశమని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దరఖాస్తు పత్రాలు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 6304949238కు సంప్రదించాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తున్న సన్‌రైజ్ స్కూల్ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల సన్‌రైజ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులు పోలీస్‌స్టేషన్, ఫైర్ స్టేషన్, బ్యాంక్, పోస్టాఫీసు, హాస్పిటల్‌ను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని, డాక్టర్లు, ఇంజనీర్లతో పాటు పోలీసులు కావాలని ఎస్‌ఐ చలికంటి నరేష్ వారికి సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోసపాటి లక్ష్మయ్యకు నాయకుల నివాళి

మోతె : బీఆర్‌ఎస్‌వీ మోతె మండల అధ్యక్షుడు దోసపాటి నరేష్ తండ్రి దోసపాటి లక్ష్మయ్య దశదిన కర్మను సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌ఎంఈఏ జిల్లా అధ్యక్షుడు పంతిని శ్రీధర్‌నాయుడు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు.. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు ఇండ్ల కృష్ణ, ఉప్పుల మధు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బొర్ర సతీష్, బానోతు దేవులా, జానీపాష, నవీన్, వినోద్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. సోమవారం నడిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం నడిగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన గ్రామ పంచాయతీ నూతన కార్యాలయం, రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం పక్కా భవనం, బృందావనపురం, రత్నవరం గ్రామాల్లో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. దళారుల బెడద లేకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంఈఓ ఉపేందర్‌రావు, ఏఓ రాయపు దేవప్రసాద్, ఎంపీఓ విజయకుమారి, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ జెడ్పీటీసీ బాణాల కవిత, సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు, సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



నడిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



నడిగూడెంలో గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



కోదాడ : ఆస్పత్రిలో వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పద్మావతి

బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ చింతలపాటి వాణిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలో పాఠశాలలో నిర్వహించనున్న జోనల్ మీట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, పేరెంట్స్ కమిటీ కన్వీనర్ బాణాల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కోదాడ : ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యసేలందించాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. సోమవారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో పరిశీలించి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా రుద్రాభిషేకం పనులకు అంకురార్పణ

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈ నెల 27న నిర్వహించబోయే మహా రుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం పట్టణంలో ఎస్‌ఎస్‌పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో మహా రుద్రాభిషేకం పనులకు అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం నాగసాధువులచే 8 అడుగుల మట్టి శివలింగానికి మహా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గజ్జి ప్రభాకర్, పోలిశెట్టి నరసింహారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, యడ్ల విజయ్, గుండా శ్రీనివాస్, బోనాల నారాయణరావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, కీతా సుధాకర్, పల్లపు పుల్లయ్య, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహా రుద్రాభిషేకం పనులకు అంకురార్పణ పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు

ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్

మునగాల : రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ పొందాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ అన్నారు. సోమవారం మునగాల మండలంలోని తాడువాయిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోదాడ డివిజన్ వ్యవసాయ అధికారి డి.ఎల్లయ్య, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వసంత, తాడువాయి, మునగాల పీఏసీఎస్‌ల చైర్మన్లు తొగరు సీతారాములు, కందిబండ సత్యనారాయణ, సీపీఎం నాయకుడు బుర్రి శ్రీరాములు, సీఈఓ నాగేందర్, డైరెక్టర్లు మారం వెంకటరెడ్డి, పత్తిపాక లక్ష్మీనారాయణ, బి.వెంకటేశ్వర్లు, నలమాద వెంకటేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తాడువాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

పాలకవీడు : కార్మికులు మైనింగ్ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, సీజీఎం నాగమల్లేశ్వరరావు అన్నారు. సోమవారం పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భవానీపురంలో గల డెక్కన్ పరిశ్రమ ఆవరణ నిర్వహించిన 39వ గనుల భద్రతా వారోత్సవాల్లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పని ప్రదేశాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, నియమాలు వివరించారు. అనంతరం యాజమాన్యం, కార్మికులచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. పరిశ్రమ వివిధ విభాగాల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న డెక్కన్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని వినతి



చిలుకూరు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



మఠంపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

చిలుకూరు : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సోమవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మెడిసిన్స్ రేట్లు కూడా తగ్గించాలన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నగదు అందించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు జె.నరసింహారావు, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి నాగాటి చిన రాములు, బుడిగెం రామారావు, బాబు పాల్గొన్నారు.

నడిగూడెం : రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువల ధరలను తగ్గించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వి.సరితకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, నాయకులు ఏనుగుల వీరాంజనేయులు, బీరవల్లి సుధాకర్‌రెడ్డి, ఎస్‌కె.మస్తాన్, వెంకటరెడ్డి, తిరపయ్య, శ్రీనివాస్, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు.

మఠంపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసరాల వస్తువుల ధరలు తగ్గించాలని, రైతులకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మంగా రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా పాండునాయక్, మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు ఎం.రాజు, రాము, అలీబాబా, శంభయ్య, మగతానాయక్ ఉన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కోదాడరూరల్ : వయో వృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వయోవృద్ధుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతూ సోమవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు చోట్ల తల్లిదండ్రుల నుంచి వారి కుమారులు ఆస్తులు తీసుకొని వారి సంరక్షణను పట్టించుకోవడం లేదని దీంతో వారు భిక్షాటన చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆయన అన్నారు. మండవ లింగరాజ్, రంజిత్, నవీన్, సైదులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణ

మండల కమిటీ ఎన్నిక

మేళ్లచెరువు : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మేళ్లచెరువు మండల కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని శాంతి పాఠశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు సమక్షంలో మండల అధ్యక్షుడిగా పాయిలి నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా కె.సత్యనారాయణ ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రూప్లానాయక్, నాగేశ్వరరావు, జానకి, వాసవి, పూర్ణిమ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలి

మునగాల : మండల కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎన్.పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోదాడ నియోజకవర్గానికి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని మంజూరు చేసినందున ఆ కేంద్రాన్ని మునగాలకు బదిలీ చేయాలని కోరారు. మండలంలోని ఎస్‌ఎంపేట వద్ద సుమారు ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నందున అక్కడ ఏర్పాటు చేస్తే వాహనాల రాకపోకలకు వీలుగా ఉంటుందన్నారు. దీంతో స్పందించి ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, గంధం సైదులు, కాసర్ల శ్రీనివాస్, జె.వెంకటేశ్వర్లు, గట్టు ఉపేందర్, ఎనుగుల వీరబాబు పాల్గొన్నారు.

ప్రతి కార్పెంటర్‌కు విశ్వకర్మ పథకం వర్తింపజేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : ప్రతి కార్పెంటర్‌కు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వర్తింపజేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ధనుంజయనాయుడు కోరారు. సోమవారం నేరేడుచర్లలోని విశ్వబ్రాహ్మణ సంఘం సత్రం భవనంలో జరిగిన కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాభై ఏళ్లు నిండిన కార్పెంటర్లకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లంకెపల్లి శంకరాచారి, ప్రధాన కార్యదర్శిగా తుంగతుర్తి జానకిరామాచారి, శ్రీపాద శ్రీనివాసచారిని ఎన్నుకున్నారు. సమావేశంలో మల్లాచారి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, జగన్నాథచారి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలని వినతి

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ సోమవారం నడిగూడెంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయ నాయక్ కోదాడ ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కళాశాలలో సీసీ రోడ్డు నిర్మించాలని, కళాశాలకు ఇరువైపులా ప్రహరీ నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జానీపాషా, శ్రీధర్, కృష్ణ, మహేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

మోతె : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు ఆరోపించారు. సోమవారం మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు కార్మిక వర్గానికి అనేక వాగ్దానాలు ఇచ్చి నేడు వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, మండల కన్వీనర్ దోసపాటి శ్రీనివాస్, పంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవిచంద్ర, మండల అధ్యక్షుడు బొమ్మగాని వెంకటేశ్వర్లు, సైదులు, గుర్వయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



హుజూర్‌నగర్ : పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు, నాయకులు

హుజూర్‌నగర్ : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని ఎస్‌ఐ ముత్తయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, శాంతి సంఘం అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శాంతి స్థూపం వద్ద పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గెల్లి రవి, కోడి ఉపేందర్, చప్పిడి సావిత్రి, సులువ చందు, సీహెచ్.రవి, కె.యోహాన్, సైదా మేస్త్రి, వి.కృష్ణగౌడ్, సైదులునాయక్, ఏఎస్‌ఐలు బలరామిరెడ్డి, జుట్టుకొండ రమేష్, హెచ్‌సీ హరినారాయణ, పి.నాగేశ్వరరావు, పోలీసులు, పలు పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రియదర్శిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

గరిడేపల్లి : ప్రజా రక్షణలో పోలీసుల పాత్ర కీలకమైందని ఎస్‌ఐ చలిగంటి నరేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో కోదాడ-మిర్యాలగూడ ప్రధాన రహదారిలో విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాతకోటి లింగారెడ్డి, తోడేటి వెంకటేశ్వర్లు, వెంకటనర్సిరెడ్డి, రామాంజనేయులు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు, తదితరులు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, ఉపాధ్యాయులు వీరయ్య, సైదులు, హర్ష, రాంబాబు, లక్ష్మి, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలపై దాడులు చేస్తే సహించేది లేదు

కోదాడరూరల్ : హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులు చేస్తే సహించేది లేదని పలువురు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు అన్నారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ తల్లి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బీజేపీ నాయకులతో కలిసి వారు కోదాడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేవాలయాలపై ఉద్దేశపూర్వకంగానే దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఘటనపై శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నెబోయిన వెంకట్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కారింగుల ఉపేందర్, విజయ్, సతీష్, అశోక్, వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.



కోదాడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు

చింతలపాలెంలో డయేరియా కేసులు

- 15 రోజులుగా విజృంభణ
- ఇద్దరు వ్యాధిగ్రస్తులను హుజూర్‌నగర్‌కు తరలింపు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండల కేంద్రమైన చింతలపాలెంలో డయేరియా వ్యాధి పూర్తిగా అదుపులోకి రాలేదు. గత పదిహేను రోజుల క్రితం గ్రామంలో డయేరియా కేసులు వెలుగుచూశాయి. దీంతో గ్రామంలోని ముత్యాలమ్మ గుడి బజార్‌లో డయేరియా నివారణ క్యాంపు ఏర్పాటు చేశారు. అయినా వ్యాధి అదుపులోకి రాలేదు. అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యంతోనే వ్యాధి విస్తరిస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మొక్కుబడిగానే వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని, ఉన్నతాధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం గ్రామంలో మరో ఇద్దరు డయేరియా వ్యాధిగ్రస్తుల పరిస్థితి విషమించింది. దీంతో బాధితుల్లో ఒకరు బాలింత, మరొకరు మహిళ కాగా వైద్య సిబ్బంది వారిరువురిని 108 వాహనంలో హుజూర్‌నగర్ హాస్పిటల్‌కు తరలించారు. గ్రామంలో 24 గంటల వైద్యసేవలు అందించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పరిశుభ్రమైన మంచినీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయమై డాక్టర్ సచిన్‌ను సంప్రదించగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డయేరియా నివారణ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నారని, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.



డయేరియా వ్యాధిగ్రస్తులను 108 వాహనంలో హుజూర్‌నగర్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది

మాజీ కౌన్సిలర్‌కు నివాళి



గురవమ్మ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కుక్కడపు కాశయ్య సతీమణి మాజీ కౌన్సిలర్ గురవమ్మ ఆదివారం మృతి చెందారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ రావు, నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ఆమె మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు, పలువురు సంతాపం తెలిపారు.

'తపస్' ఉద్యమ కార్యాచరణ కరపత్రాల ఆవిష్కరణ

సూర్యాపేట : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణ కరపత్రాలను సోమవారం సూర్యాపేట పట్టణంలోని జయ పాఠశాలలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి, హరిప్రసాద్, బ్రహ్మచారి, తిరుమలేష్, బొలిశెట్టి శ్రీనివాస్, రామినేని శ్రీనివాస్, యామా రజినీ, శ్రీనివాసరావు, సురభి శ్రీధర్, జూలకంటి వెంకట్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండేళ్లుగా నిరుపయోగం

- స్వచ్ఛంద సంస్థల సహకారంతో నాలుగేళ్ల క్రితం ట్యాంకుల నిర్మాణం
- నిర్వహణ మరిచిన అధికారులు

నడిగూడెం : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గల తాగు నీటి ట్యాంకులు గత రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. ట్యాంకులకు నీరందించే మోటార్లు మరమ్మతులకు గురికావడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీతో పాటు బొడ్రాయి బజారులో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నాలుగేళ్ల క్రితం ఈ మినీ వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఇక రెండుళ్లుగా వాటి నిర్వహణను సంబంధిత అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని అధికారులకు అనేకసార్లు చెప్పినా స్పందన కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేయించి ట్యాంకుల ద్వారా నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



బొడ్రాయి బజారులో నిరుపయోగంగా ట్యాంకు

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



మా బజార్‌లో రెండు సంవత్సరాలుగా మోటార్లు పనిచేయకపోవడంతో ట్యాంకు నిరుపయోగంగా ఉంది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి, ట్యాంకును ఉపయోగంలోకి తీసుకురావాలి.

– గుండ్లపల్లి సైదమ్మ, బొడ్రాయి బజార్